# 'ప్రొడ్యూసర్' ని చేసిన ప్రొడ్యూసర్



ఔత్సాహిక కళాకారులకు మంచి అవకాశం.

మేము తీయబోవు ప్రయోగాత్మక సంచలన చిత్రంలో అందరూ నూతన నటీనటులనే ఎన్నుకొనుటకు నిర్ణయించాం. ఈ చిత్రంలో నటించ గోరువారు వారి వారి వివరాలను, ఫోటోలను పంపండి. ఆఫీసు వేళలలో మమ్మల్ని స్వయంగా కూడా సంప్రదించవచ్చు.

పత్రికలో ఈ ప్రకటన చూడగానే సరితకు పట్టరాని ఆనందం అయ్యింది. సినీనటి కావాలనే తన చిరకాల వాంఛితం ఈడేరబోతున్నట్లనిపించింది. ఆమెలో

అందచందాలకు, హావభావాలకు కొదువలేదు. కాలేజీ నాటకాలలో నటనానుభవం ఉంది. వీటన్నిటికీ మించి ఆమె ఉత్సాహానికి ఇంట్లోవారి మద్దతు ఉంది. ప్రకటన చేసిన ఈ కొత్త కంపెనీ అదే ఊరులో ఉండటం వల్ల తనకి అయ్యే ప్రత్యేకమైన అదనపు ఖర్చులేదు. అందువల్ల ప్రయత్నించి చూడడంలో తప్పేమి ఉంది! తప్పక ప్రయత్నించాలనే అనుకుంది.

ఆరోజు సరిత ఆ ఫిలిం కంపెనీకి వెళ్లింది. తనలాగే ఇంటర్వ్యూకి వచ్చిన వారు ఇంకా కొందరున్నారక్కడ.

సరిత టర్న్ వచ్చింది. వయ్యారంగా నమస్కారం పెడుతూ లోపలికి ప్రవేశించింది ఆమె.

ప్రొడ్యూసర్ శివానంద్ తల ఆడింపుతో ఆమె నమస్కారాన్ని స్వీకరించి, చిరునవ్వుతో ఆమెకు ఆహ్వానం పలుకుతూ, కూర్చోమన్నట్లు చేయి చూపి ఆమెకి సంజ్ఞ చేశాడు.

ప్రశ్నలు- జవాబుల కాండ పూర్తి అయింది. సరిత శివానంద్‌కి నచ్చింది. తన సంతోషానికి సూచనగా, ఆమెకి డ్రింక్ అందించాడు. ఆ మాట్ డ్రింక్‌ని ఆమె స్వీట్‌గా, నిస్సంకోచంగా తాగేసింది.

"శహబాష్... మీరు తప్పక పైకి వస్తారు" అని సరితని ప్రశంసించాడు శివానంద్..

ఆ విధంగా ప్రారంభమైన సరితా- శివానంద్‌ల స్నేహం జోరుగా సాగి అడ్డుగోడలను తొలగించుకుంటూ చాలాచాలా దూరంగా వెళ్లింది. ప్రొడ్యూసర్‌గారిని సంతోషపెట్టడం- విజయ సోపానాలలో మొదటిమెట్టని సరిత భావించింది. కాబోయే ప్రఖ్యాత నటీమణితో కలిసి చనువుగా గడపడం, అసామాన్యమైన గౌరవంగా భావించాడు శివానంద్.

ఆరు నెలలు గడిచాయి.

ఒళ్ళు మాట యేమో కాని.., సరితకి పొట్ట మాత్రం పెరిగింది.

"నాయనోయ్... హీరోయిన్ నా కొంప ముంచింది. పొట్ట పెరిగిన హీరోయిన్ నా సినిమాకు పనికిరాదు" అని తీర్పు ఇచ్చాడు శివానంద్.

"బాబోయ్... ఈ ప్రొడ్యూసర్ నా కొంప ముంచాడు. సినిమా ప్రొడ్యూస్ చెయ్యకపోయినా, నన్ను ప్రొడ్యూసర్ని చేసి సినిమాలకి పనికిరాకుండా చేశాడు దేవుడోయ్!" అని గోలెట్టింది సరిత.

మరో నాలుగు నెలల తర్వాత రిలీజ్ అయ్యింది- పిక్చర్ కాదు...

'సరిత బేబీ!'

– జన సుధ పత్రిక... *12 జనవరి ' 79*